తీరు మారదు.. తిప్పలు తప్పవు

- అక్రమ నిర్మాణాలు చేపట్టి వరద నీటి కల్వర్టు మూసివేత
- చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు
- జలమయంగా హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి
- జాడ కనిపించని జాతీయ రహదారి శాఖ అధికారులు
- కల్వర్టుకు మరమ్మతులు చేస్తే కాని రోడ్డుపై నీళ్లు నిలువవంటున్న స్థానికులు

మొయినాబాద్‌లో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నీళ్లు నిలువడంతో ఇబ్బందుల్లో వాహనదారులు

రోడ్డుకు కింది వైపున కల్వర్టును మూసి గేట్ పెట్టిన ఓ యజమాని

వీఆర్‌కే మెడికల్ కళాశాల వద్ద రోడ్డు మీద నిలిచిన వర్షపు నీటి నుంచి వెళ్తున్న వాహనాలు

పేరుకే జాతీయ రహదారి

మొయినాబాద్, సెప్టెంబర్ 11 : మొయినాబాద్‌లోని ఏ-వన్ కారు సర్వీసింగ్ సెంటర్ ఎదుట హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి లోతట్టు ప్రాంతంలో ఉన్నది. రోడ్డు వేయక ముందు నుంచే ఆ ప్రాంతంలో వరద కాలువ ఉండేది. రోడ్డు నిర్మాణం చేపట్టిన ప్పుడు రోడ్డు కింది భాగం నుంచి వరద నీరు వెళ్లడానికి కల్వర్టు నిర్మాణం చేపట్టారు. దీంతో ఎంత వర్షం వచ్చినా ఇబ్బంది ఉండేది కాదు. కాని రోడ్డుకు ఇరువైపులా ఎప్పుడైతే నిర్మాణాలు చేపట్టారో అప్పటి నుంచి రహదారి సమస్యల నిలయంగా మారింది.

జలదిగ్బంధంలో జాతీయ రహదారి

ప్రస్తుతం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి కొద్దిగా వర్షం పడితే చాలు జలదిగ్బంధంలో ఉంటున్నది. ఇక భారీ వర్షం పడితే రెండు ఫీట్ల ఎత్తులో వరద నీరు రోడ్డుపై నిలుస్తున్నది. దీంతో రోడ్డు పక్కన ఉన్న వ్యాపార సముదాయాల్లోకి వరద నీరు చేరుతున్నది. రోడ్డుకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతోపాటు రోడ్డు కింది భాగం నుంచి వరద నీరు వెళ్లడానికి ఉన్న కల్వర్టు ద్వారాలను రెండు వైపులా మూసివేశారు. అంతేకాకుండా రోడ్డు కింది భాగాన భూమి ఉన్న యజమానులు తమ స్థలంలోకి వరద నీరు రాకుండా వరద కాలువ మూసివేయడం తోపాటు తమ స్థలానికి అడ్డుగా ప్రహరీ నిర్మాణం చేపట్టారు. కల్వర్టు ఆనవాళ్లు కనిపించకుండా మట్టి పోశారు. దీంతో వరద నీరు మొత్తం జాతీయ రహదారిపై వంద మీటర్ల మేర నిలిచిపోతున్నది. భారీ వాహనాలు మిన హాయించి మిగతా వాహనదారులు తమ వాహనాలను నడపాలంటే జంకుతున్నారు. జాతీయ రహదారి పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అలాగే గండిపేట చౌరస్తా సమీపంలో వీఆర్‌కే మెడికల్ కళాశాల ఎదుట కూడా నీళ్లు నిలువడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల జాడెక్కడ..?

వర్షాలు పడినప్పుడు జాతీయ రహదారి జలదిగ్బంధంలో ఉంటే ఆ సంస్థ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. జాతీయ రహదారి మొయినాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండడంతో.. స్థానికులు సమస్య నెలకొన్నప్పుడు గ్రామపంచాయతీ సిబ్బందికి సమాచారమిస్తారు. వారు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. మళ్లీ సమాచారమిస్తే అదే పరిస్థితి. కాని నీళ్ల నిలువకుండా శాశ్వత పరిష్కారం చూపించే నాథుడే కరువయ్యాడు. కల్వర్టు మూసివేసిన వ్యక్తులు, వరద నీరు వెళ్లకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టినవారిపై చర్యలు తీసుకొని రహదారిపై నీళ్లు నిలువకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ కార్యదర్శే ఒకవైపు మూసివేయించాడు

రోడ్డుపై నీళ్లు నిలువడానికి గ్రామపంచాయతీ అధికారులు కూడా ప్రధాన కారణం. రోడ్డు కింది నుంచి ఉన్న కల్వర్టు పక్కన మిషన్ భగీరథ పథకం మంచినీటి ప్రధాన పైపు లైన్ గేట్ వాల్వ్ మ్యాన్‌హోల్ ఉంది. అయితే మ్యాన్ హోల్ చుట్టూ మురుగునీరు నిలుస్తుండటంతో గ్రామపంచాయతీ కార్యదర్శి ఇండ్లు కూల్చిన శిథిలాల వేస్టేజ్ తీసుకొచ్చి పోశాడు. దాంతోపాటు పక్కనే ఉన్న కల్వర్టు ద్వారాన్ని ఒకవైపు కూడా చెత్తాచెదారం, మట్టితో పూర్తిగా మూసివేశారు. కల్వర్టు కింద భూమి ఉన్నవారి నుంచి డబ్బులు తీసుకోవడం వల్లే వారి పొలంలోకి నీళ్లు వెళ్లకుండా కల్వర్టు ద్వారాలను పూర్తిగా మూసివేశాడు. రోడ్డు కల్వర్టు ద్వారాలు మూసివేయడంతోనే నీళ్లు రోడ్డుపై ఆగుతున్నాయి.

- మహ్మద్ అజీజ్, కారు మెకానిక్, మొయినాబాద్

కల్వర్టు ఆనవాళ్లు లేకుండా చేశారు

జాతీయ రహదారి కింది నుంచి ఉన్న కల్వర్టును రెండు వైపులా మూసి ఆనవాళ్లు లేకుండా చేశారు. కల్వర్టు పక్కనే ప్లాట్లు కొనుక్కుని నిర్మాణాలు చేపట్టడంతోపాటు తమ దుకాణాల సమూదాయాల ఎదుట మొరం పోసుకోవడంతో కల్వర్టు పూర్తిగా కనిపించకుండా పోయింది. రోడ్డు కిందకి పొలం ఉన్న వ్యక్తి కల్వర్టు ముందు భాగంలో పొలానికి గేట్ పెట్టుకుని గేట్‌కు, కల్వర్టు మధ్య ఎత్తుగా మట్టిపోయడంతో కల్వర్టు ఆనవాళ్లు పూర్తిగా కనిపించడంలేదు. నీళ్లు పోవడానికి ఎటూ దారి లేకపోవడంతో దుకాణాల సమూదాయాల్లోకి వెళుతున్నాయి. నీళ్ల దారికి అడ్డంగా నిర్మాణాలు కడుతున్నా పంచాయతీ అధికారులు చోద్యం చూశారు. ఇప్పుడు కల్వర్టు పక్కన చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చే ధైర్యం చేయలేక రాత్రి సమయంలో ప్రహరీకి చిన్న రంధ్రం చేసి కొద్దిగా నీళ్లు వెళ్లేటట్లు చేశారు. రోడ్డుపై నీళ్లు నిలువకుండా ఉండాలంటే మూసివేసిన కల్వర్టుకు మరమ్మతులు చేయాల్సిందే.

- బద్దం ప్రతాప్‌రెడ్డి, మాజీ సైనికుడు, పెద్దమంగళారం



చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాణిక్యారెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

సొంత గూటికి బీఆర్ఎస్ శ్రేణులు

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 11 : చేవెళ్ల మీదుగా వికారాబాద్ జిల్లా పరిగికి వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సమక్షంలో చేవెళ్ల మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్ అధ్వర్యంలో చేవెళ్లలోని షాబాద్ చౌరస్తాలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాణిక్యారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, చందు, కృష్ణ, పామెన మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఇబ్రహీంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జంగారెడ్డి, నాయకులు రాంప్రసాద్, ఘనీ, మల్లేష్, మహేందర్, శంకర్, రామాగౌడ్ ఉన్నారు.

జిల్లా పశువైద్యాధికారిగా వి.సదానందం

వికారాబాద్, సెప్టెంబర్ 11 : వికారాబాద్ జిల్లా నూతన పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారిగా డాక్టర్ వి.సదానందం బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నల్గొండ జిల్లాకు సహాయ సంచాలకులుగా వెళ్లి పదోన్నతిలో భాగంగా డిప్యూటీ డైరెక్టర్‌గా వికారాబాద్ జిల్లాకు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు మెరుగైన సేవలు అందించి, రైతుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. పశువులకు ఎలాంటి రోగాలు ఉన్నా వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు.

దూరవిద్య ఎంసీపీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 11: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే ఎంసీపీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీపీ మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్ పరీక్షలను ఈ నెల 20 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న మోకిల గ్రామస్తులు

నాలాలను కబ్జాల నుంచి కాపాడండి

రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు ఫిర్యాదు చేసిన మోకిల గ్రామస్తులు

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 11 : మోకిల గ్రామంలోని నాలాలను కబ్జాల చెర నుంచి విడిపించాలని మోకిల గ్రామస్తులు బుధవారం రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోకిల గ్రామంలో ఉన్న నాలాలను వెంచర్ యాజమాన్యం, అపార్ట్ మెంట్, విల్లాలవారు కబ్జా చేయడంతో వరద నీరు మొత్తం పంట పొలాల్లోకి, ఇండ్ల లోకి చేరుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మోకిల గ్రామంలోని లా పలోమా విల్లాస్‌ల లోకి పూర్తిగా వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. అధికారులు తూతూమంత్రంగా ఒకచోట ఏర్పాటు చేసిన ప్రహరీని తొలగించి నీటిని బయటకు వదిలారని తెలిపారు. గ్రామ శివారులోని పంట పొలాల్లో కూడా నీరు చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాల వారు కాలువలు, నాలాలను పూర్తిగా వరద నీరు వెళ్లకుండా కబ్జా చేసి ప్రహరీలను నిర్మిస్తే హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. వరద నీరు వెళ్లకుండా నాలాలు, కాల్వలను కబ్జా చేస్తే వారికి అనుమతులు ఎలా ఇస్తున్నారని మండిపడ్డారు. కాగా మోకిల గ్రామ శివారులోని ఫిరంగినాలాను కూడా అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని తెలిపారు. నాలాల విషయంలో గత సంవత్సరంలో కూడా అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని.. నేటికీ ఎవరూ స్పందించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా నాలాలను గుర్తించి సర్వే నిర్వహించి యథావిధిగా వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఫరీద్, మోకిల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యం, నాయకులు వాజిద్, వెంకటేశ్‌ముదిరాజ్, శేఖర్, వెంకట్, అహ్మద్, షబ్బీర్, రషీద్, యాసిన్, కాజా భాషా, నజీర్ పాల్గొన్నారు.

ఆల్ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సరళ మైన ఓటరు జాబితాకు పాటుపడదాం

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, సెప్టెంబర్ 11 : సరళమైన ఓటరు జాబితాను ఏర్పాటు చేసుకునే దిశగా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై ఆల్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. జనవరి 1లోపు 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఎన్నికల్లో ఓ వజ్రాయుధం లాంటిదని, మన కోసం, మన భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు ఓటు హక్కు ఎంతగానో ఉపయోగపడుతుందనే అంశాన్ని కొత్త ఓటర్లకు తెలపాలని ఆయా పార్టీల నాయకులకు సూచించారు. మీమీ వార్డుల్లో 18 ఏండ్లు నిండినవారిని గుర్తించి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో అడ్రస్ మార్పు, పేరు తప్పుగా ఉన్నా, పోలింగ్ కేంద్రం మార్పులు వంటి వాటికి కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. చనిపోయినవారిని గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించేలా సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

గడ్డమల్లాయగూడలో వ్యవసాయ డ్రోన్‌ను ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడి

క్రీడా డైరెక్టర్ వీ.కే.సింగ్

యాచారం, సెప్టెంబర్ 11 : ఆధునిక వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులను పొందవచ్చని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా) డైరెక్టర్ వీ.కే.సింగ్ అన్నారు. మండలంలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో ఇఫ్కో ఆధ్వర్యంలో వ్యవసాయ డ్రోన్‌లను ప్రదర్శించారు. అనంతరం గ్రామ రైతులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీ.కే.సింగ్ మాట్లాడుతూ.. వ్యవసాయ డ్రోన్‌ల సహాయంతో ఎరువులు, మందులు తక్కువ సమయంలో సులభంగా చల్లవచ్చన్నారు. గ్రామంలో రైతులకు వరి, పత్తి, టమాట, మొక్కజొన్న, వంగ పంటలలో డ్రోన్‌తో పిచికారీ చేసే విధానాన్ని స్వయంగా ప్రయోగించి రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులకు ఎనిమిది రకాల విత్తనాలను అందజేసి వాటి సాగు విధానంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. రైతులు డ్రోన్‌ల సహాయంతో ఆధునిక వ్యవసాయం చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధి రవిశంకర్, హెడ్ చంద్రకాంత్, ఇఫ్కో రాష్ట్ర మార్కెటింగ్ కమిటీ మేనేజర్ కృపాశంకర్, క్రీడా శాస్త్రవేత్తలు సంజీవరెడ్డి, గోపాలకృష్ణ, తిమ్మన్న, విజయ్‌కుమార్, జాగృతి రోహిత్, అన్నిదా బీబీ, అశీష్, భార్గవి, గిరిజావేణి, రాజు, ప్రాజెక్ట్ స్టాఫ్ శ్రీకాంత్, సలీమ్, సాయికుమార్, సునీత్, రైతులు రామలింగారెడ్డి, సురేశ్‌రెడ్డి, అశోక్, శ్రీశైలం ఉన్నారు.

గులాబీలో సూక్ష్మ పోషకాలు పెంపొందించాలి

మల్లాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొత్తూరు, సెప్టెంబర్ 11 : గులాబీ పంటలో సూక్ష్మ పోషకాలు పెంపొందిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కొత్తూరు మండలంలోని దత్తత గ్రామం మల్లాపూర్ వ్యవసాయ పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మొక్కజొన్న, పత్తి, గూలబీ పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పూత దశలో ఉన్న పత్తి పంటలో రసం పీల్చే పురుగులు, పొగాకు లద్దె పురుగులు, బ్యాక్టీరియన్ నల్లమచ్చ తెగులు, వడల తెగులును గమనించామని వివరించారు. రైతులకు వీటికి సంబంధించిన నివారణ చర్యలు తెలియజేశారు. కార్యక్రమంలో దత్తత గ్రామ చైర్మన్ డా.సురేందర్‌రెడ్డి, సభ్యులు డా.పద్మశ్రీ, డా.ప్రమీల, డా.అరుణ పాల్గొన్నారు.

పేరేమో మహాత్ముడిది.. చెప్పేవన్ని అబద్ధాలే..

మాధవరం రంగారావు

మియాపూర్ , సెప్టెంబరు 11 : దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహాత్ముడి పేరు పెట్టుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతున్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని ఇప్పుడేమో తాను పార్టీ మారలేదని అబద్ధపు ప్రకటన లిస్తున్నారని , ఇంతకు ఆయన ఏ పార్టీలో ఉన్నారో నియోజకవర్గ ప్రజలకు స్పష్టం చేయాలని రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం రంగారావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం ఇల్లేం దేవాలయం కాదు.. సీఎం పూజారేమి కాదని, ఆయన వేసుకున్న కండువా దేవాలయం కండువా కాదని, స్పష్టమైన కాంగ్రెస్ కండువా అన్నారు. పదవుల కోసం పోలేదని చెబుతున్న గాంధీ పీఏసీ చైర్మన్ పదవిని ఎందుకు తీసుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే గాంధీ అంటే నియోజకవర్గ ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ప్రజల అండదండలతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పార్టీలు మారుస్తూ నమ్ముకున్న ప్రజలను నిట్టనిలువునా మోసం చేస్తున్నారని రంగారావు విమర్శించారు. ఇకనైనా స్వలాభం కోసం రాజకీయ క్రీడను మానుకోవాలని ఆయన హితవు పలికారు.

వీ హబ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఇన్‌క్లూజన్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : వీ హబ్ ఆధ్వర్యంలో మహిళ ఆంత్రప్రెన్యూర్లను తీర్చిదిద్దేలా ప్రాజెక్టు ఇన్‌క్లూజన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణలో మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రధానంగా ఐదు రంగాల్లో 6 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. రీసస్టయినబులిటీ సీఎస్ఆర్ పార్టనర్‌గా వ్యవహరిస్తుండగా.. టైర్-2, 3 ప్రాంతాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా వీ హబ్ వర్గాలు వెల్లడించాయి. జూబ్లీహిల్స్‌లోని వీ హబ్ ప్రధాన కార్యక్రమంలో మధ్యాహ్నం 3-4 గంటల వరకు జరిగే ప్రాజెక్టు ఇన్‌క్లూజన్ కార్యక్రమం ప్రారంభించనున్నట్లుగా అసోసియేట్ డైరెక్టర్ ఊహ తెలిపారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ సిగ్గుచేటు

మియాపూర్, సెప్టెంబర్ 11 : పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలని చెప్పి అదే బాటలో నడుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని ఏం చేయాలని బీజేపీ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు ఎద్దేవా చేశారు. తన స్వలాభం కోసం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఏ పార్టీ ఉంటే దాని పంచన చేరటం గాంధీకి ఆనవాయితీగా మారిందని, అలాంటి వ్యక్తిని అక్కున చేర్చుకుని పదవి ఇవ్వటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమేనన్నారు. బీజేపీ ప్రతిపక్ష కాంగ్రెస్ కేవీ వేణుగోపాల్‌కు చైర్మన్ ఇచ్చిన విషయాన్ని రేవంత్ గుర్తు పెట్టుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, అధికారంలోకి వచ్చిన ఆయన ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, పదవుల ఆశ చూపి పక్క పార్టీల నేతలను లాగేసుకుంటున్నారని సీతారామరాజు పేర్కొన్నారు.

నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 11 : రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు బుధవారం మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఏఐ, ఎంఎల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లర్నింగ్ అంశాల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్‌రావు, ఏబీ విద్యాసంస్థల డైరెక్టర్ డా. సంజయ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా తెలిపారు. 150కిపైగా నిరుద్యోగ యువత ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డా.సుమగ్న పట్నాయక్, సాయికిశోర్, ఎఫ్‌డీపీ సెల్, ఏస్కీ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనానికి యత్నించి కటకటాలపాలు

- ఆరుగురిలో ఇద్దరు మైనర్లు.. జువైనల్ కోర్టుకు తరలింపు
- నలుగురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

మొయినాబాద్, సెప్టెంబర్ 11 : దారి కాచి వాహనాంలో వెళ్తున్న వారిని అడ్డుకుని వారి కళ్లలో కారం పొడి చల్లి నగదును అపహరణ చేసిన దారి దోపిడి దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. శంషాబాద్‌లోని కూల్ డ్రింక్స్ గోడౌన్‌లో మహమ్మద్ ఈసా, భరత్ డ్రైవర్‌లుగా పని చేస్తూ కూల్ డ్రింక్స్ మొయినాబాద్, శంషాబాద్ మండలాల్లో దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. అందులో భాగంగా ఆగస్టు 25న వారిద్దరు కూల్‌డ్రింక్స్‌ను మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్‌లో సరఫరా చేశారు. అనంతరం కనకమామిడి గ్రామానికి వెళ్తున్నారు. గతంలో అందులో పనిచేసి మానేసిన యువకుడు బైండ్ల శ్రీరామ్ అలియాస్ కిట్టు అతడితోపాటు మరో ఐదుగురు కూల్ డ్రింక్స్ వాహనం రాగానే అడ్డుపడి మహమ్మద్ ఈసా, భరత్ కళ్లల్లో కారం పొడి చల్లి వారి వద్ద ఉన్న రూ.1.20 లక్షల నగదును అపహరించారు. ఈ విషయమై కూల్ డ్రింక్స్ డీలర్ మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. మొయినాబాద్ పోలీసులతోపాటు సీసీఎస్ పోలీసులు, డిటెక్టర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి చాకచక్యంగా దారి దోపిడీకి పాల్పడిన ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను ప్రత్యేకంగా సీఐ అభినందించారు. దోపిడీకి పాల్పడిన వారిలో ఇద్దరు మైనర్‌లు ఉండటంతో వారిని జూవైనల్ కోర్టుకు తరలించారు. దారిదోపిడీలో పాల్గొన్నవారిలో శంషాబాద్ మండల పరిధిలోని తొండుపల్లి గ్రామానికి చెందిన బైండ్ల శ్రీరామ్ అలియాస్ కిట్టు, మొయినాబాద్ మండల పరిధిలోని జీవన్‌గూడ గ్రామానికి చెందిన వడ్డె నర్సింహ, హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన సాయి అలియాస్ రామకృష్ణ, లంగర్‌హౌస్‌లో ఉండే నరేందర్‌సింగ్ తోపాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నారు.